ప్రగతికి బాటలు


కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం రోడ్డు

- పెనుకొండ నియోజకవర్గంలో రోడ్లకు నూతన శోభ
- దాదాపుగా రూ.260 కోట్లతో పనులు
- అన్ని మండలాల్లో పనులు చేయడంతో ప్రజల హర్షం

పెనుకొండ రూరల్: నియోజకవర్గంలోని రహదారులు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. పెనుకొండ పట్టణం మొదలు నియోజకవర్గంలోని గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, రొద్దం, పెనుకొండ మండలాల్లోని రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. గతంలో మట్టి రోడ్లు, కంకర తేలిన రోడ్లు, సింగిల్ రోడ్లతో ఎప్పుడూ ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రోడ్లకు మహర్దశ పట్టింది.

చేసింది గోరంత.. ప్రచారం కొండంత

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులు తక్కువైనా ప్రచారం మాత్రం కొండంత చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు స్థానికులు కూడా విమర్శిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు రూ.వంద కోట్లతో నామమాత్ర రహదారులు నిర్మించి కమీషన్లు దండుకున్నారంటున్నారు.

రహదారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెనుకొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఎమ్మెల్యే శంకరనారాయణ రహదారులు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రోడ్ల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారు. గత ప్రభుత్వాలను తలదన్నేలా వివిధ రహదారుల నిర్మాణాలకు దాదాపుగా రూ.260 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వీటిలో మెజార్టీ రహదారులు పూర్తికాగా కొన్ని చోట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

మచ్చుకుకొన్ని...

- పెనుకొండ రైల్వే గేట్ నుంచి పట్టణం మీదుగా కృష్ణదేవరాయ విగ్రహం వరకు రూ.10 కోట్లతో పనులు పూర్తి చేశారు.
- పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి షీఫారం వరకూ రూ.20 కోట్లతో పనులు జరుగుతున్నాయి.
- మడకశిర రోడ్డు పడదాకులపల్లి అమ్మవారి దేవాలయం నుంచి దొమ్మతిమర్రి వరకు రూ.27 కోట్లతో పనులు జరిగాయి.
- రొద్దం మండలంలోని ఎల్‌జీబీ నగర్ నుంచి రాచూరు మీదుగా రాగిమేకలపల్లి వరకు రూ.16 కోట్లతో పనులు చేశారు.
- కొడిగినహళ్లి నుంచి సంగమేశ్వర టెంపుల్ వరకు వయా శాసనకోట దాకా రూ.3.70 కోట్లతో పనులు పూర్తి చేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లు		
మండలం	ఖర్చుపెట్టిన మొత్తం	కిలోమీటర్లు
పరిగి, గోరంట్ల, సోమందేపల్లి	రూ.26.44 కోటు	56.44 కి.మీ
పెనుకొండ	రూ.27.46 కోట్లు	31.395 కి.మీ
రొద్దం	రూ.46.50 కోట్లు	50 దాదాపుగా..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...		
మండలం	మంజూరైన మొత్తం	కిలో మీటర్లు
పరిగి, గోరంట్ల, సోమందేపల్లి	రూ.120.13 కోట్లు	186.68 కి.మీ
పెనుకొండ	రూ.66.90 కోట్లు	28.100 కి.మీ
రొద్దం	రూ.70.10 కోట్లు	59.350 కి.మీ


పూర్తయిన కొడిగేహనహళ్లి - సంగమేశ్వర దేవాలయం బ్రిడ్జి రోడ్డు


పెనుకొండ వై జంక్షన్ నుంచి నిర్మించిన రహదారి


రూపుదిద్దుకున్న సోమందేపల్లి - హిందూపురం రోడ్డు

ఇరుకు రోడ్ల నుంచి ఉపశమనం



నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపుగా అన్ని రోడ్లను బాగు చేస్తుండటం హర్షణీయం. ఇరుకు రోడ్ల నుంచి వాహనదారులకు ఉపశమనం లభించింది. ప్రతి గ్రామానికి నేడు రోడ్ల నిర్మాణాలు చేపట్టడం ఇబ్బందులు తప్పాయి. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– మల్లికార్జున, దుద్దేబండ

ప్రమాదాలు తగ్గాయి



నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం నుంచి కొత్తచెరువు మండలం బార్డర్ వరకు సింగల్ రోడ్డు ఉండేది. దీంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. అయితే ఇప్పుడు డబుల్ రోడ్డు వేయడంతో ఏ ఇబ్బంది లేకుండా పోయింది. ప్రమాదాల సంఖ్య కూడా తగ్గింది.
– శ్రీనివాసరెడ్డి, తిమ్మాపురం

పెనుకొండ అభివృద్ధే ధ్యేయం



గత ప్రభుత్వం పెనుకొండ అభివృద్ధిని పట్టించుకోలేదు. ఒక పెద్ద సంస్థ పెనుకొండ కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని నిర్మించలేక వెళ్లిపోయింది. అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నేడు కొండపైకి రహదారి నిర్మాణం పూర్తి చేశాం. రాబోవు రోజుల్లో నరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మునుపెన్నడూ ఏ ప్రభుత్వం చేయలేని విధంగా రహదారి నిర్మాణ పనులను సీఎం జగన్ సహకారంతో పూర్తి చేశాం. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తాం.
– శంకరనారాయణ , ఎమ్మెల్యే

క్లుప్తంగా

గుడికట్ల సంబరాల పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పెనుకొండ: కురుబల గుడికట్ల సంబరాల పోస్టర్లను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణతో పాటు కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కురుబ సంఘం నాయకులతో కలసి ఎమ్మెల్యేతో మాట్లాడుతూ కురుబల గుడికట్ల సంబరాలు నవంబర్ 19న జిల్లా కేంద్రమైన అనంతపురంలో జరుగుతాయన్నారు. జిల్లాలోని కురుబ సంఘం నాయకులు గుడికట్ల సాంప్రదాయాల మేరకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కురుబలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని కమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.లక్ష్మీనారాయణరెడ్డి (56) మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి కమ్మయ్యగారిపల్లికి వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

14న ఉచిత గుండె వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ తదితరులు

పెనుకొండ: స్థానిక ఆఫీషియల్ క్లబ్ ఆవరణలో ఈనెల 14న ఉదయం 10 గంటల నుంచి ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ రాజారమేష్, గోరంట్ల సీఐ సుబ్బరాయుడు చేతుల మీదుగా బుధవారం కరపత్రాలను విడుదల చేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి


కాకి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఏపీజీబీ ఆర్ఎం రవీంద్రారెడ్డి

రొళ్ల: ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ ద్వారా అందించే సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆశాఖ రీజినల్ మేనేజర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రొళ్ల, రత్నగిరి ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ శాఖలను ఆయన సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించి బ్యాంక్ లావాదేవీల పై ఆరా తీశారు. ఇందులో భాగంగానే కాకి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 38 మంది విద్యార్థులకు బుధవారం రాశి సీడ్స్ కంపెనీ తరఫున ఆ సంస్థ ప్రతినిధులు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ కంపెనీ ప్రతినిధులు రామస్వామి, రాజేంద్రస్వామి, హెచ్ఎం రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోండి

చిలమత్తూరు: రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 15 లోపు సంబంధిత ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. నూతనంగా పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇది వరకే రైతు భరోసా పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

గడ్డివామికి నిప్పు


దగ్ధమవుతున్న గడ్డివామిని చూపిస్తున్న బాధితుడు

పావగడ: పట్టణ సమీపంలోని సర్వేనంబర్ 18-1లో రైతు రవికుమార్‌కు చెందిన గడ్డివాముకు మంగళవారం రాత్రి దుండగులు నిప్పంటించారు. పశువుల కోసం ఇటీవలే సుమారు రూ.1.5 లక్షలు వెచ్చించి సుమారు 9 లోడ్ల వేరుశనగ పొట్టును కొనుగోలు చేసినట్లు బాధితుడు రవికుమార్ తెలిపారు. గడ్డివాముకు దుండగులు నిప్పుపెట్టడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారాన్ని చెల్లించాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: మండలంలోని వెంకటగిరిపాళ్యంకు చెందిన మహిత అనే యువతికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం రూ. 2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. మహితా అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 2 లక్షలు మంజూరైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధితురాలికి ఎమ్మెల్యే శంకరనారాయణ చెక్కు అందించారు. ముఖ్య నాయకులు ఆదినారాయణప్ప, రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు తయాబ్, సద్దాం, మండల అగ్రీ కమిటీ చైర్మన్ కొండలరాయుడు, గణేష్, బోయబాబు, శ్రీరాములు, మున్నీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


లేపాక్షి: బాలికా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

లేపాక్షి: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి ప్రకాష్, ప్రిన్సిపాల్ నీలిమా, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రిటైర్డ్ సబ్ కలెక్టర్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం పులమతిలోని ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయురాలు సరోజమ్మ, మహిళా పోలీస్ శశి, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో బాలికల దినోత్సవంపై పీహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ అవగాహన కల్పించారు. లింగ వివక్షత, బాల్యవివాహాలు, నిరక్షరాస్యతపై ఆమె వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీబాయి, సిహెచ్ఓ శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాటాడారు. ప్రిన్సిపాల్ సమన్, ఏటీఎల్ సావిత్రి పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ప్రాథమిక స్థాయి నుంచి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయి ఎదగాలని సర్పంచ్ గీత బాలికలకు సూచించారు. బుధవారం ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ సుదర్శనరెడ్డి, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ ఆడబిడ్డలంతా ఉన్నత చదువును అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబులేసు, ఎస్టీఎల్ బాలయ్య, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుక


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని చౌళూరులో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకను వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలుకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, ఇందిరమ్మ, పురుషోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో మంత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి జన్మదిన వేడుకను వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా చంద్రగిరిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి ర్యాలీగా వెళ్లి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు సానే ఉమారాణి కార్యాలయంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలిచి జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఉమారాణి పేర్కొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

లేపాక్షి: లేపాక్షిలోని ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ, బైజూస్‌పై ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం ఉదయం డిప్యూటీ డీఈఓ రంగస్వామి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్పతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ


రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లేపాక్షి: లేపాక్షిలోని మహాత్మా జ్యోతిభా పూలే ఏపీ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు విజయ్, రవీంద్ర, సురేంద్ర, సూర్యనారాయణ, మహేష్, సాయికుమార్‌నాయక్ జిల్లా టీమ్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 1, 2 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో అనంతపురం జిల్లా మూడోస్థానం దక్కించుకుందన్నారు. రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'రియల్'గా కొండను తవ్వేశారు


పనులను అడ్డుకున్న దళిత నాయకులు

పావగడ: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని 144 సర్వే నంబరు భూమి లో లేఔట్ ఏర్పాటుకు ఏకంగా కొండ బుడుము వరకు జేసీబీ యంత్రాలతో తవ్వేశారు. సుమారు 1.5 ఎకరాల సర్కారు భూమిని ఆక్రమించడానికి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రయత్నించాడు. అయితే స్థానిక దళిత సంఘం నాయకులు బుధవారం అక్కడ చేస్తున్న పనులను అడ్డుకున్నారు. దళిత సంఘం నాయకులు ఎస్ హనుమంతరాయప్ప మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుని లే అవుట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నించిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ రాజగోపాల్, గ్రామ కార్యదర్శి రాజేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటన పై తహసీల్దారు వరదరాజుకు నివేదిక అందిస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మడకశిర: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. జిల్లేడుగుంట గ్రామ సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు.

పెనుకొండ ఎస్ఐగా రాజేష్



పెనుకొండ: పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ.రమేష్‌బాబు కియా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజేష్ బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఎస్ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న డీపీఎం నాగరాజు

రొళ్ల: గ్రామాల అభివృద్ధికి యానిమేటర్లు, గ్రామ సంఘం లీడర్లు కృషి చేయాలని వైకేపీ డీపీఎం నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామాల యానిమేటర్లు, గ్రామ సంఘం లీడర్లలకు గ్రామ అధికార పునరుద్ధరణ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. డీపీఎం నాగరాజు మాట్లాడుతు గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మహిళా సంఘాల బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు.

అనారోగ్యంతో సీఆర్పీ మృతి


శివన్న (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి క్లస్టర్‌లో సీఆర్పీగా పని చేస్తున్న రంగనపల్లి చెందిన శివన్న (40) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ-2 శ్రీధర్, పాటు తోటి సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది శివన్న మృతి పట్ల సంతాపాన్ని తెలిపారు. మృతునికి భార్య మంజులతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' పై వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు.

శ్రీరామ రక్ష .. జగనన్న సురక్ష

సాక్షిబృందం: ప్రజలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష.. శ్రీరామ రక్ష లాంటిదని వక్తలు తెలిపారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


హిందూపురం మండలం సడ్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గోరంట్ల: మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి


మడకశిర మండలం మెళవాయిలో ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్